
ప్రజాశక్తి
గురువారం 12 జనవరి 2023



ప్రయాణికుల సౌకర్యార్థం రైలుకోచ్ రెస్టారెంట్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడానికే కార్తికేయ ఫుడ్ వరల్డ్ రైలు కోచ్ రెస్టారెంట్ ను ప్రారంభించినట్లు విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ శతపతి తెలిపారు. బుధవారం విజయనగరం రైల్వే స్టేషన్‌లోకార్తీక్ ఫుడ్ వరల్డ్ రైల్వే కోచ్ రెస్టారెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వేపరిధిలో ఇది మొదటిది కాగా ఆంధ్రప్రదేశ్‌లో రెండోదని తెలిపారు. ప్రయాణికులకు ఆహార ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనాలు అందించడానికి ఇది దోహద పడుతుందన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో 8 ప్రత్యేక రైళ్లను విజయనగరం మీదుగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డిసిఎం త్రిపాటి, విజయనగరం స్టేషన్ మాస్టర్ మురళీకృష్ణ, కమర్షియల్ మేనేజర్ ప్రసాద్, ఫుడ్ వరల్డ్ రెస్టారెంట్ ఓనర్ కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



వ్యక్తి రాజకీయాలను పట్టించుకోకపోయినా, వ్యక్తులను రాజకీయాలు ప్రభావితం చేస్తునే ఉంటాయి. ఇందులో మంచిచెడ్డలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పాలకులు మంచి మార్గాన్ని ఎంచుకోకపోయినా, అటువంటి పరిస్థితుల్లో యావత్తు ప్రజానీకం ప్రశ్నించకపోయినా పరిపాలన పక్కదారి పడుతుంది. అలాంటి పరిణామాలు అడ్డుకోకపోతే రాజకీయాలు వ్యక్తులనే కాదు, సమాజాన్నే శాశిస్తాయి. ప్రస్తుతం అటువంటి పరిస్థితే ఎదురైంది మన జిల్లాకుగానీ, రాష్ట్రానికిగానీ, చివరికి దేశానికిగాని. పాలకుల విధానాల వల్ల అత్యధికంగా యువశక్తి నిరుపయోగంగా మారుతోంది. ముఖ్యంగా స్వార్థరాజకీయాలు పెరగడంతో జన జీవనమే దినదినగండంగా మారుతోంది. ఇటువంటి సందర్భంలో (జనవరి 12న) జాతీయ యువజన దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

యువతా మేలుకో..!

- పెరిగిన స్వార్థరాజకీయాలు
- దోపిడీని పెంచుతున్న ప్రభుత్వ విధానాలు
- నిలదీయకపోతే అగమ్యగోచరమే
- నేడు జాతీయ యువజన దినోత్సం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో యువజన జనాభాయే ఎక్కువగా ఉంది. స్థానికంగా తగినన్ని విద్యాసంస్థలు లేవు. ప్రస్తుతం నూతన విద్యావిధానం పేరిట పాఠశాలలను కూడా కుదిస్తున్న సంగతి విధితమే. ఉన్నత విద్యకోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. దీనికితో ఆర్థికంగా వెనుకబడిన జిల్లా. తల్లిదండ్రుల రెక్కల కష్టం తిండికి, వైద్యం, చదువు సంధ్యలకే సరిపోని పరిస్థితి. తీరా చదువుకున్నాక ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు దొరకడం లేదు. చదువుకున్న పాఠ్యాంశాలు ఒకటి, ఉద్యోగ సందర్భాల్లో తీసుకుంటున్న ప్రామాణికాలు మరొకటి. తల్లిదండ్రులను పోషించాల్సిన వయసులో ఉద్యోగాల వేటలో దేశ, విదేశాలు వలసపోవాల్సిన పరిస్థితి. ఆర్థిక స్థోమత లేనివారు కూలి పనులతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి. మన జిల్లాల్లో ఇప్పటికీ ఉపాధి హామీ పనులకు వెళ్తున్న బిటెక్, బిఎస్‌సి, బిఇడి చదువుతున్న యువకులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అంతకు మంచి ఆటోమొబైల్ రంగంలో చిన్నపాటి ఉద్యోగం కావాలన్నా విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు పోవాల్సిన దుస్థితి దాపురించింది. మరోవైపు రాజకీయాల్లో జవాబుదారీతనం, పారదర్శకత పూర్తిగా లోపిస్తున్నాయి. రాజకీయం అంటే సేవచేయడం అనే అర్థానికి బదులు ఆర్థికంగా డబ్బులుంటేనే రాజకీయ నాయకులమౌతామని పరిస్థితి వచ్చేసింది. ఇటువంటి తరుణంలో యువత రాజకీయాలపట్ల పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో కుటుంబ రాజకీయాలు పెరిగాయి. ఆర్థికంగా అవకాశం ఉన్నవారు మాత్రమే రాజకీయాల్లో ప్రవేశించి, ఎన్నికల వేళ ఖర్చుచేసిన మొత్తానికి రెట్టింపు రాబట్టుకునేందుకు దిగజారిన పరిస్థితులు చూస్తున్నాం. ఇటువంటివారు చట్టసభల్లోకి వెళ్లడం వల్ల ప్రజలకు వ్యతిరేకంగాను, దోపిడీకి, యువజను శక్తిని నిర్వీర్యం చేసే దిశగా నిర్ణయాలు జరిగిపోతున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వర్గాలవారూ పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల దోపిడీకి గురౌతునే ఉన్నారు. ఇటువంటి తరుణంలో యువత కేవలం క్రీడలు, సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా 'కాలేజీ కుర్రవాడ కులాసాగ తిరిగినోడ... విలసాల మాట మరువరో.. ఓ విద్యార్థి విప్లవాలమాట నడవరో' అన్నట్టుగా సమాజంలో జరుగుతున్న దోపిడీ విధానాలపై గొంతెత్తాల్సిన అవసరం ఉంది. యువతీ యువకులు అటువంటి బాట పడతారని ఆశిద్దాం.



ధాన్యం కొనాలని ఆందోళన

ప్రజాశక్తి-సీతానగరం

రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంటిపేట రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ రైతుల వద్ద చివరి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అధికారులు.. ఆ దిశగా తీసుకున్న చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని అంటిపేట, రామవరం, రెడ్డివానివలస, ఆర్.వెంకంపేట గ్రామాల్లో 10 వేల వరకు ధాన్యం బస్తాలు రెడీగా ఉన్నాయని చెప్పారు. వీటికి కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రకటనలేవీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. పండగ వచ్చినా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో లబోదిబోమంటున్నారని ఆవేద వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయాలని రెండు రోజుల క్రితం రైతులు ఆందోళన చేస్తే, తరలిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు.



అంటిపేట ఆర్‌బికె వద్ద ఆందోళన చేస్తున్న రైతులు




అధికారులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం, సిపిఎం నాయకులు

దిగొచ్చిన అధికారులు

రైతుల ఆందోళనకు అధికారులు దిగొచ్చారు. ఆర్‌బికె ఎదుట ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు సివిల్ సప్లై డిఎం నాయక్, ఎఒ ఎస్.అవినాష్, సిఎస్ డిటి చేరుకున్నారు. రైతుల వద్ద ఉన్న పది వేలు బస్తాలను రెండు రోజుల్లో తరలిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే నాలుగు లారీలను తెప్పించి 2 వేల బస్తాల వరకు తరలించారు. ఎస్‌ఐ కె.నీలకంఠం ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి రమణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రెడ్డి ఈశ్వరరావు, జి.వెంకటరమణ, ఎపి రైతుసంఘం నాయకులు బి.అప్పారావు, బి.నారాయణస్వామి, రైతులు శశిభూషణం, సత్యనారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

11,154 మందికి జగనన్నతోడు

రూ.11.15 కోట్లు విడుదల ● 10,866 మందికి రూ.24 లక్షల వడ్డీ చెల్లింపు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో 11,154 మందికి రూ.11.15 కోట్ల జగనన్న తోడు నిధులు, 10,866 మందికి 24.07 లక్షల వడ్డీ చెల్లింపు నిధుల చెక్కులను కలెక్టరు నిశాంత్‌కుమార్ అందించారు. బుధవారం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, లబ్ధిదారులు ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరం నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాన్ని తీసుకొని స్వయం ఉపాధి పొందాలని కోరారు. ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారు ఈ నిధులతో వృద్ధి చేసుకోవాలన్నారు. సకాలంలో రుణ వాయిదాలు చెల్లిస్తే మరింత ఎక్కువరుణం పొందవచ్చునని చెప్పారు. చెల్లించిన వడ్డీ తిరిగి పొందవచ్చునని తెలిపారు.

చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలు ఏర్పాటుచేసిన స్టాల్ తిలకించి, వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. జగనన్న తోడు ఐదో విడతగా జిల్లాలో 11,154 మందికి రూ.11.15 కోట్లను అందించగా, అందులో 7,038 మందికి కొత్తగా రుణం మంజురు చేసినట్లు వివరించారు. 4116 మంది గతంలో తీసుకున్న రుణం చెల్లించగా మళ్లీ రుణం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆరో విడత వడ్డీ తిరిగి చెల్లింపు పథకంలో భాగంగా 10,886 మందికి 24.07 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ, మెప్మా సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఫిబ్రవరి 11న జిల్లా కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకొని కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. కోర్టులలో పెండింగులో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం జిల్లా కోర్టు చాంబరులో పోలీసు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ వారీగా పెండింగ్ కేసులపై సమీక్షించారు. వాటిలో సాధ్యమైనన్ని కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు. న్యాయ సేవా సంస్థ పది అంశాలకు సంబంధించి పనిచేస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సేవలను, అమలు చేస్తున్న పథకాలను సామాన్యుడి చెంతకు చేర్చాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ , అడిషనల్ ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, డిఎస్‌పిలు సుభాష్, జి.వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుకాణాలకు వేలం

ప్రజాశక్తి-మక్కువ

శంబర జాతర సందర్భంగా వాహనాలు నిలిపేందుకు, దుకాణాల కోసం గురువారం వేలం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు శంబర సచివాలయం వద్ద వేలం నిర్వహిస్తున్నారు.

బాధితులు 24 వేల మంది

వసూలు రూ.8 కోట్లు

- పప్పుల చిట్టీ దందా ఇదీ
- మోసగించిన నిందితులు అరెస్టు
- రూ.1.28కోట్లు రికవరీ



స్వాధీనం చేసుకున్న నగదు, పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ప్రజాశక్తి-విజయనగరం

సంక్రాంతి కానుక (పప్పుల చిట్టీ) పేరుతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 24వేల మంది నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1,28,33,073 విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక వెల్లడించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

పప్పుల చిట్టీ పేరుతో డబ్బులు వసూలు చేసిన కేసులో ప్రధాన నిందితుడు కొండకరకాం గ్రామానికి చెందిన మజ్జి అప్పలరాజు, మజ్జి రమేష్, కొండగుంపాంకు చెందిన పతివాడ శ్రీలేఖ బృందంగా ఏర్పడి సంక్రాంతి పండుగకు 24 రకాల సరుకులు ఇస్తామని ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.300 చొప్పున వసూలు చేశారని తెలిపారు. ఇందుకుగాను వివిధ గ్రామాల్లో 189మంది ఏజంట్లను నియమించుకొని సుమారు 24వేల మంది నుంచి వసూళ్ళకు పాల్పడ్డారన్నారు. ఈ తరహా చిట్టీని 2021లో నిందితులు ప్రారంభించి, రూ.8,09,74,300 మొత్తాన్ని వసూలు చేశారని తెలిపారు.

ప్రధాన నిందితుడు అప్పలరాజు విజయవాడలో వాటర్ ప్లాంట్ కొత్తగా పెట్టేందుకు రూ.3.5 కోట్లను పెట్టుబడిగా పెట్టాడని, సకాలంలో ప్లాంటు ప్రారంభం కాకపోవడంతో చిట్టీ కట్టిన వారికి సరుకులు అందించలేకపోయారని తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. అరెస్టయిన నిందితుల నుంచి రూ.15.18 లక్షల విలువైన 297.710 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 44,12,900 నగదు, రూ.29,95,000 విలువైన భూముల డాక్యుమెంట్లును స్వాధీనం చేసుకోవడంతో పాటు, 5 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 39,06,326 నగదును ఫ్రీజ్ చేసామన్నారు. ఇవి కాకుండా వీరి పేరున 16 వాహనాలు, రెండు వాటర్ ప్లాంట్లు ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూముల మార్కెట్ విలువ ఎక్కువగానే ఉంటుందని, వీటిని కోర్టులో దాఖలు చేసి, విచారణ అనంతరం కోర్టు వారి అనుమతితో బాధితులకు అందజేస్తామని ఎస్‌పి తెలిపారు. కేసు దర్యాప్తుకు ప్రత్యేక అధికారులను నియమించిన రాష్ట్ర డిజిపి ఈ పప్పుల చిట్టీ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేసు విచారణను మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్పీ అర్జునరావు అనే అధికారులను ప్రత్యేకంగా నియమించారని తెలిపారు. అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని ప్రజలను ఎస్‌పి కోరారు. ఆస్తులను రికవరీ చేయుటలో ప్రధాన భూమిక పోషించిన చీపురుపల్లి ఇన్ చార్జ్ డిఎస్‌పి బి.మోహనరావు, గుర్ల ఎస్‌ఐ శిరీషలను ఎస్‌పి అభినందించారు.



అంగన్వాడీ కేంద్రం వద్ద బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర

బాధ్యతగా పనిచేయండి

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర

ప్రజాశక్తి-పాలకొండ

బాధ్యతగా పనిచేయాలని స్త్రీ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర.. అంగన్వాడీలను ఆదేశించారు. బుధవారం మండలంలో కొండాపురం అంగన్వాడీ కేంద్రం, సచివాలయం, పాఠశాలను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఎంతమంది పిల్లలున్నారు, గర్భిణులకు పోషకాహారం అందుతుందా? లేదానన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం చూపొద్దన్నారు. పాఠశాలను సందర్శించి అక్కడ అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెరుగైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎంపిడిఒ డొంక త్రినాథులు, ఐసిడిఎస్ పిఒ గీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

సీతంపేట : సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.వి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కోర్సులలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్, ప్లంబింగ్ జనరల్ అసిస్టెంట్‌కు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. ఈ కోర్సులలో చేరేందుకు రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848438254, 6305302188 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పథకాలకు అర్హతే కొలమానం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-సీతానగరం

ప్రతి ఒక్కరికీ అర్హత కొలమానంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సీతానగరం మండలం లక్ష్మీపురం, బూర్జ గ్రామ సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. సిబ్బంది సమయపాలనను పాటించాలని సూచించారు. గ్రామ సచివాలయ పరిధిలోని పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వివరాలపై ఆరా తీశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ గోడపై జగనన్న తోడు, అమ్మ ఒడి, జగనన్న కానుక తదితర పథకాల లబ్ధిదారుల జాబితా లేకపోవడంతో తప్పనిసరిగా లబ్ధిదారుల వివరాలు సచివాలయంలో ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, ఇ క్రాప్ నమోదు, తదితర అంశాలను పరిశీలించారు. గ్రామాల్లోని పౌష్టికాహార లోపం, బరువు తక్కువ ఉన్న చిన్నారుల వివరాలను అంగన్వాడీ కేంద్రంతోపాటు, సచివాలయంలో కూడా జాబితాను పొందుపరచాలని చెప్పారు. ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ షేక్ ఇబ్రహం, లక్ష్మీపురం, బూర్జ గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు పరవాడ వెంకటనాయుడు, టి.శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ శంకర్రావు, తదితరులు, పాల్గొన్నారు.



సచివాలయంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిఒ 1ని రద్దుచేయాలని నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

జిఒ నంబర్ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ పాచిపెంటలో సిఐటియు నాయకులు సిహెచ్.పోలరాజు ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా జిఒ 1ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించే చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

డిప్యూటీ సిఎంని కలిసిన ఐటిడిఎ పిఒ

సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పిన విష్ణుచరణ్

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను బుధవారం పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ కలిశారు. రాజన్నదొరకు పిఒ విష్ణుచరణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాజన్నదొర నివాసంలో ఆయనని తొలిసారిగా కలిసి పావుగంట సేపు మాట్లాడారు. 'గిరిజన మంత్రి అంటే అంత అలుసా?' అన్న శీర్షికతో ఇటీవల 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనం జిల్లాలో కలకలం సృష్టించింది. అధికార పార్టీ శ్రేణుల్లో విస్తృత చర్చకు దారితీసింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి మన్యం జిల్లా అధికారులెవరూ రాకపోవడంతో చర్చనీయాంశమైంది. అయితే ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు సెలవులో ఉన్న కారణంగా హాజరు కాలేదని తెలుస్తోంది. జలుబు, జ్వరం కారణంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హాజరు కాలేదని అధికారపార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు

మన్యం జిల్లాలో అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలను అందించేలా చూడాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర.. ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌కు సూచించారు. మున్సిపాలిటీ జగనన్న లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. మార్చిలోగా ఇళ్ల పునాదులు నిర్మించేలా చూడాలని సూచించారు.



రాజన్నదొరకు మొక్క అందిస్తున్న పిఒ విష్ణుచరణ్

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కొమరాడ : ప్రభుత్వం డిపట్టా ఇచ్చిన రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ సిహెచ్.రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఉలిపిరి పంచాయతీ అల్లువాడలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు మధ్య ఉన్న భూ సమస్య పరిశీలన కోసం వెళ్లారు. గతంలో గ్రామానికి చెందిన రైతులకు డిపట్టా కింద రెవెన్యూ భూమిని అప్పగించారని తెలిపారు. ఆ భూమి అదే శాఖాధికారులకు సంబంధించిందని చెప్పడంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ, అటవీశాఖలు కలిసి సర్వే చేసి, నివేదికలు అందించాలని హైకోర్టు ఆదేశించడంతో భూములను పరిశీలించారు. 1979 నుండి ఆ భూములు రెవిన్యూ శాఖ కింద ఉన్నాయని తహశీల్దార్ తెలిపారు. హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ పరిశీలనలో ఫారెస్ట్ రేంజర్ త్రినాథరావు, గౌరీశంకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ స్వామి నాయుడు ఉన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న 39 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, చీరలు, ఇతర సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేష్, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కో-ఆప్షన్ సభ్యులు ఎం.వెంకట్రావు, వైసిపి సీనియర్ నాయకులు టి.శంకర్రావు, బోను ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఆంజనేయులు

సిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కురుపాం జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న రోగులతో ఆయన మాట్లాడి, వైద్య సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో ఉన్న మందులను పరిశీలించారు. అంబులెన్స్ సర్వీసులు ప్రజలకు ఏవిధంగా అందుతున్నాయో వైద్య సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను, స్టాఫ్ రిజిష్టర్‌ను పరిశీలించారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పారిశుద్య కార్మికులతో మాట్లాడుతూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మీదేనని సూచించారు.

స్టేట్ బ్యాంకును..

స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్‌ని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు ఆకస్మికంగా సందర్శించారు. బ్యాంకులో ఉన్న ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. అనంతరం బ్యాంక్ సిబ్బందితో మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సీతంపేట

సచివాలయాల ద్వారా ఎక్కువ సర్వీసులు అందించి సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపిడిఒ గీతాంజలి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడితే ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌లో చేయాలన్నారు. నాడు-నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. చెత్త సంపద సృష్టి కేంద్రాలు అభివృద్ధికి, ఆదాయానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. గృహ నిర్మాణ లక్ష్యాలు అధిగమించాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ మాస, కార్యదర్శులు సుదర్శనరావు, పాపారావు, వినోద్, శేఖర్, రాజశేఖర్, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న సిఐ సింహాద్రినాయుడు

వాహనాలన్నీ తనిఖీ చేయాల్సిందే

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఒడిశా నుండి వచ్చిన ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని సాలూరు రూరల్ సిఐ సింహాద్రినాయుడు సిబ్బందికి సూచించారు. బుధవారం చెక్‌పోస్టు వద్ద పోలీసులకు ఆయన పలు సూచనలు చేశారు. పశువులు, గుట్కా, సారా, గంజాయి తదితర చట్ట విరుద్ధంగా రవాణా చేసే ఏ వాహనమైనా తప్పకుండా తనిఖీ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ ఎస్‌ఐ ప్రయోగ మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వైసిపి మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం మండలం దిగువమండ గ్రామంలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనులను నిర్లక్ష్యం చేస్తుందని, యువతను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాసయ్య, నాయకులు బుజ్జి, క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకట్రావు, పువ్వల రామారావు, నరేష్, లోవరాజు, పోలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి గ్రామంలో బుధవారం జెసిబి ద్వారా పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు రహదారిపై నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్, ఎంపిటిసి సుదర్శనరావు, పోరెడ్డి వెంకటనాయుడు పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సచివాలయ డిడిఒ జె.శ్యామ్ పాల్గొన్నారు.



కాలువలో పూడికను తొలగిస్తున్న జెసిబి

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని గుమడ గ్రామానికి చెందిన ఏనుగుల సుబ్బారావు, పెదశాఖకు చెందిన మెల్లక సంజీవరావు సారా తరలిస్తున్నట్లు పట్టుకున్నట్లు ఎస్ఐ జగదీశ్‌నాయుడు తెలిపారు. ముందుస్తు సమాచారం మేరకు దాడులు చేసినట్లు పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శ పాఠశాల ఇంట.. పతకాల పంట

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు బాక్సింగ్‌లో సత్తాచాట్టారు. శ్రీకాకుళం జిల్లా స్థాయిలో నిర్వహించిన శాప్ బాక్సింగ్ పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు వి.రాజేష్, ఎన్‌కె శాంతి, వి.హారిక, సాయి నిశాంత్, పి.సాయిలక్ష్మి స్వర్ణ పతకాలు సాధించారు. కె.జశ్వంత్, సాయినిఖిల్, ఎస్.జ్ఞానేశ్వరి, జి.స్పందన రజత పతకాలు కైవశం చేసుకున్నారు. వి.దివాకర్, ఎ.జశ్వంత్, పి.సాయిగణేష్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్, బాక్సింగ్ కోచ్ కె.సోమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు జి.శివరాం ప్రసాద్ అభినందించారు.



సాధించిన పతకాలతో భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పెదమరికి క్రీడాకారులకు..

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదమరికి పంచాయతీకి ఆరో రిపబ్లిక్ కప్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు దక్కాయి. మహారాష్ట్రలో సికొకాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీలలో ముద్దాడ కార్తికేయ, మసియా యువతేజ వెండి, బొండపల్లి తరుణ్ రాజ్, కొండగొర్రి ఆకాష్ రజత పతకాలు సాధించారు. క్రీడాకారులను రూరల్ ఎస్ఐ వై.సింహాచలం, సర్పంచ్ హెచ్.గంగమ్మ, కోచ్ పి.సాగర్, మాజీ సర్పంచ్ ఆర్.సోమశేఖర్, టి.పకీర్‌నాయుడు, అసిస్టెంట్ కోచ్ ఎం.వీరన్న అభినందించారు.

అడిగిన వారందరికీ ఉపాధి

డ్వామా పీడీ రామచంద్రరావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో అడిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని డ్వామా పీడీ రామచంద్రరావు.. సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని చోళ పదం గ్రామంలో జన్ని చెరువును పరిశీలించారు. అనంతరం చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి వేతన దారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు ప్రారంభించాలని ఎపిఒ బాలకృష్ణను ఆదేశించారు. వలసల నివారణకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. అందులో ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఉపాధి కూలీలు రెండు పూటలా పనికి వెళ్లాలని, అలాంటప్పుడే కనీస వేతనాలు అమలవుతాయని తెలిపారు. ఉపాధి కూలీలకు ప్రతిరోజూ పని కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు ముందుగా పనులు గుర్తించాలన్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించలేదని ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనికి వెళ్లే ఉపాధి కూలీలకు రెండు పూటలా మేట్లు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ బాలకృష్ణ, ఇసి సోమేశ్వరరావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వీరఘట్టంలో గడపగడపకు..



పింఛనుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం పంచాయతీ పరిధిలోని 1, 3, 4 సచివాలయాల పరిధిలో బుధవారం ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారుడు వి.నాగభూషణ్ గడపను సందర్శించినప్పుడు, ప్రతి నెలా ఒకటో తేదిన వాలంటీర్ తలుపు తట్టి పింఛను ఇస్తున్నారని ఎమ్మెల్యేతో చెప్పారు. మరెవరో ముఖ్యమంత్రి అయితే పింఛను ఉంటుందో, ఊడుతుందో తెలియదు గానీ, సిఎం జగన్ తనకు మేలు చేశారని సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిసూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇరుగుపొరుగు వారికి చెప్పి, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను బుక్‌లెట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, సర్పంచ్ పి.గౌరమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్రీ లీలప్రసాదరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు డి.లలిత కుమారి, పిఎసిఎస్ డైరెక్టర్లు భోగి లత మాణిక్య చంద్రశేఖర్, కె.ఆంజనేయులు, నల్లబెల్లి సుహాసిని, పి.శ్రీనివాసరావు, దుర్గారావు, పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్

ప్రజాశక్తి-కొమరాడ

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్తు సిఇఒ ఎం.అశోక్ కుమార్ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా కార్యాలయంలో ఉన్న పలు రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్

పవన్ అంటే భయమెందుకు? : జనసేన

ప్రజాశక్తి-పాలకొండ

ఒక్కసీటూ గెలవలేదంటూ జనసేనాని హేళన చేసిన వైసిపి నాయకులకు పవన్ కళ్యాణ్ అంటే భయమెందుకని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు గర్భాన సత్తిబాబు ప్రశ్నించారు. బుధవారం పాలకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర యువత సమస్యలు తెలుసుకోవాలని, వారి వాణి వినిపించాలని యువశక్తి కార్యక్రమాన్ని పవన్ నిర్వహిస్తున్నారని తెలిపారు. యువశక్తి కార్యక్రమంలో యువత, జనసైనికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం యువశక్తి పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పాలకొండ.. యువశక్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

వీరఘట్టం : మండలంలోని పనస నందివాడ, నడుకూరు, బిటివాడ తదితర గ్రామాల్లో యువశక్తి కార్యక్రమం జయప్రదం చేయాలని జనసేన నాయకులు ప్రచారం చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జానీ, ఎం.పుండరీకం, సత్యనారాయణ, జి.నరేంద్ర, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహుదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

కీర్తిశేషులు, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి లాల్ బహుదూర్ శాస్త్రి వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జై జవాన్ జై కిసాన్ నినాదంతో దేశాన్ని అభివృద్ధి పథంలో పయనించడానికి శాస్త్రి వేసిన బాటలు మరువలేనివని కొనియాడారు. నీతి నిజాయితీలతో కూడిన ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు డి.మోహన్‌రావు, జి.రవికుమార్, కౌన్సిలరు బడే గౌరినాయుడు, నాయకులు భాస్కరరావు, రవికుమార్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.





పార్వతీపురం.. భాస్కర్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు ; పాలకొండరూరల్.. రవీంద్ర భారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను నిర్వహించే తీరును సంప్రదాయాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్.శ్యామసుందర్రావు, డివిజనల్ ఇన్‌ఛార్జి చుక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండలంలోని ఓని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలగ నాగమణి.. విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగు మోహనరావు, గోగుల సూర్యనారాయణ, పాలవల శారదకుమారి, పి.ఉమామహేశ్వరి, చిన్నారావు పాల్గొన్నారు.

భాస్కర్ పాఠశాలలో..

పార్వతీపురం : పట్టణంలో భాస్కర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భాస్కర్ విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం భోగి మంటలను వేశారు. ఎల్‌కెజి నుండి 10వ తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులతో సంక్రాంతి రంగుల హరివిల్లుల ముగ్గులను వేయించారు. సంక్రాంతి గేయాలను ఆలపించి, ఆటలు పోటీలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భాస్కరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. విజేతలకు చుక్క భాస్కరరావు, ప్రిన్సిపల్ బిఎల్ నాయుడు, హెచ్ఎం వై.ప్రవీణ్ బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకొండరూరల్.. ఓని ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని గోచెక్క పంచాయితీ పరిధిలోని కొసరి వానివలస, కొత్త కొసరివానివలస గ్రామాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులపై బుధవారం 'ప్రజాశక్తి' వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బసవరాజు స్పందించి, హుటాహుటీన సిబ్బందిని పంపించి మరమ్మతులు చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.



కుళాయి ద్వారా వస్తున్న నీరు



గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌డిఒ మాధురీలత

గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని సందర్శించిన డిఎస్‌డిఒ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ సమీపంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని శ్రీకాకుళం డిఎస్‌డిఒ పి.మాధురీలత బుధవారం సందర్శించారు. నూతనంగా నిర్మించిన వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, బాడ్మింటన్ కోర్టులు, ఫ్లడ్‌లైట్లను పరిశీలించారు. స్టేడియం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఆధునికంగా జిమ్, బాస్కెట్‌బాల్ స్టేడియం అన్నీ బాగున్నాయన్నారు. విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేయాలన్నారు. అనంతరం ఐటిడిఎ పిఒ బి.నవ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ తదితరులు ఉన్నారు.



చిన్నారులకు సిరప్ వేయడాన్ని పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్

రక్తహీనతను నివారించాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఐదేళ్లలోపు పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌ను క్రమం తప్పకుండా వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలో కృష్ణరాయపురం, పెదంకలాం గ్రామాలను డిఐఒ బుధవారం సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య సిబ్బంది వేస్తున్న ఐరన్ సిరప్‌ల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ప్రతి వారం రెండు సార్లు ఈ ఐరన్ సిరప్‌లను క్రమం తప్పకుండా వేయాలని ఆయన సూచించారు. తద్వారా పిల్లల్లో రక్తహీనత నివారణకు, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహపడుతుందని సూచించారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎదుగుదలకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. ఐరన్ సిరప్ వివరాలను సంబంధిత హెచ్ఐఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రాధాకాంత్, సర్పంచ్ గుణుపూరు అన్నంనాయుడు, సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలివ్వాలని గ్రీన్ అంబాసిడర్ల వినతి

ప్రజాశక్తి-కొమరాడ

గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలని సిఐటియు మండల నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన బుధవారం ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావుకు, ఇఒపిఆర్‌డికి వినతులు అందజేశారు. అనంతరం సాంబమూర్తి, గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల నాయకులు ఎం.ఆనందం మాట్లాడుతూ నెలల తరబడి గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు వేతనం కూడా అమలు చేయలేదని చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం అమలు చేయాలని, పండగ అలవెన్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్ర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, వెంకట్రావు, రాము పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ పరిధిలో మరిపివలసలో బుధవారం మధ్యాహ్నం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలోని కళ్లంలో ఎల్.శ్రీనివాసరావు, జి.రామారావుకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే సాలూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.